# మినీకథ

## చిట్కా వైద్యం

### నాగుమల్లి సత్యనారాయణ

వయసు కెదుగుతున్న ఆడపిల్లలకు స్కిప్పింగ్ అంటే చాలసరదా. కాళ్ల క్రింద వరకూ వ్రేలాడే లంగాతో. రెండు కాళ్ళూ ఒక్కసారే ఎత్తి ఎగరడం. కాళ్ళకు. లంగాకు "రోప్" తగలకుండా ఎగరడం.... నంబరాఫ్ టైంస్ ఎగరడం....క్విక్‌గా ఎగరడం— ఎంతో ఆనందంగా. చూడముచ్చటగా వుంటుంది. ఇది ఆడపిల్లల ఆట. సిటీలలో అగ్గిపెట్టెల్లాంటి అద్దెకొంపల ముందు అద్దెకున్నవాళ్ళు మసలడమే కష్టంగా వుంటే. పిల్లలు ఆడుకోవడానికి ఇంటిముందు ఇక స్థలం ఎక్కడుంటుంది? గ్రామాలలో పిల్లలాడుకోడానికి కావలసినంత ఓపెన్ ప్లేస్. ఇంటిముందు- ఇంటి వెనుక- పెరట్లో- ఊళ్ళో చాలాచోట్ల.

శ్రీరామరెడ్డిగారి ముద్దుల కూతురు శ్రీలత. తమ ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో స్నేహితురాండ్రతో కలిసి. స్కిప్పింగ్ ఆడుకుంటోంది ఉన్నట్టుండి- స్కిప్పింగ్ రోప్ పట్టుకుని పైకెత్తిన ఆమె రెండు చేతులూ అలాగే పైకే వుండిపోయాయి. తాడు క్రింద పడిపోయింది. ఎంత ప్రయత్నించినా చేతులు క్రిందికి దిగడంలేదు. ప్రక్కనున్న పిల్లలు భయపడి పరిగెత్తుకు వెళ్ళి శ్రీలత అమ్మగారికి ఆ విషయాన్ని చెప్పారు. ఆమె వచ్చి చూసి. ఆశ్చర్యపోయింది. ఆమె కూడా ఎంతో ప్రయత్నించింది. లాభం లేకపోయింది. అమ్మలక్కలు నలుగురూ పోగయ్యారు. ఏదో దెయ్యమో. దేవతో ఆవరించిందంటే దిగదుడుపులుతీసి కొబ్బరికాయలు కూడా కొట్టారు. ఊహూఁ! లాభం లేకపోయింది.

కాస్సేపటికి. ఎవరో పెద్దమనుషులతో మాట్లాడడానికి వెళ్ళిన శ్రీరామరెడ్డిగారికి ఈ విషయం తెలిసింది. వెంటనే ఆయన ఆ మంతనాలు కట్టిపెట్టి ఆ పెద్దమనుషులతో సహా ఇంటికివచ్చివాలాడు కంగారుగా. శ్రీలత పరిస్థితి చూసి బెంబేలెత్తిపోయాడు. అతనితోబాటు. ఆ వచ్చిన పెద్దమనుషులు కూడా ఎన్నోవిధాల ఎంతగానో ప్రయత్నించి చూశారు. లాభం లేకపోయింది. ఊళ్ళోవున్న ఆర్. యం. పి. డాక్టర్ని పిలిపించారు. లాభంలేక పోయింది. ఆ సాయంత్రానికి శ్రీలతను టౌన్‌లో వున్న ఓ ఎమ్‌బిబియస్‌డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లారు. ఆయన. ఎక్స్‌రే క్లినిక్‌లో ఎక్స్‌రేలను తీయించి డయాగ్నిసిస్ చేశాడు. బాల్ అండ్ సాకెట్ జాయింట్స్ డిస్‌లొకేషన్ (బోల్ ద హాండ్స్) అని ట్రీట్‌మెంట్ ప్రారంభించాడు. ఏవో ఆయింట్‌మెంట్స్ చేతి గూడలకు రాయించి మర్దనా చేయించి. రెండు ముక్కలకీ రెండు ఇంజక్షన్లుచేశాడు. రెండు కాప్స్యూల్సు. రెండు బిళ్ళలు ఇచ్చాడు. చివరకు ఫలితం రాబట్టలేక పోయాడు. ఆ రాత్రికి ఆ డాక్టరు గారి నర్సింగ్ హోంలోనే వుంచి. మరునాడు ఓ యం. యస్. అయిన ఎక్స్‌పర్ట్ సర్జన్ దగ్గరకు తీసుకు వెళ్ళారు. అక్కడ కూడా పాల్జిన్, అనైల్జిన్ వంటి పెయిన్ కిల్లింగ్ ఆంటీ రుమాటిజం ఇంజక్షను— ఇంకా ఏవేవో ఇంజక్షన్లు గుచ్చి గుచ్చి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. కాని అక్కడ కూడా లాభం లేకపోయింది. శ్రీలత చేతులు అలా ఎత్తిపెట్టే వున్నాయి. ఆమెను అంతా వింతగా. విడ్డూరంగా చూస్తున్నారు. ఆమె బాత్‌రూం అవసరాలు. ఆహార పానీయాలు. అన్నీ ఇతరుల సహాయంతోనే జరుగుతున్నాయి. శ్రీలత పరిస్థితి చూస్తుంటే. ఆమెకంటె పైవాళ్ళకే ఎక్కువ బాధగా వుంది.



"అమ్మాయిని అడ్మిట్ చేసి. జనరల్ అనస్తేసియా ఇచ్చి ఈ డిస్‌లొకేషన్స్‌ను సరిచేయవలసి వుంటుంది. అవసరమైతే ఏదైనా ఆపరేషన్ కూడా చేయవలసి వుంటుంది. కాబట్టి మీరు జనరల్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళడం మంచిది." అని సలహా ఇచ్చాడు ఆ యం. యస్ గారు. మరునాడు జనరల్ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళే ఉద్దేశ్యంతో ఆ సాయంత్రానికి అంతా ఇంటికి వచ్చేశారు.

ఆ రోజే ప్రక్క గ్రామం నుంచి ఓ ఆయుర్వేద వైద్యుడు ఆ వూరిలో వున్న చుట్టాలను చూడడానికి వచ్చాడని అమ్మలక్కలు కొందరు వచ్చి శ్రీరామరెడ్డి గారికి చెప్పారు. అది విని ఆయన నవ్వుకున్నాడు. ఆయన ఆ రోజులలోనే బి. ఎ. చదువుకున్నాడు. సర్జికల్ ఎక్స్‌పర్ట్ సరిచేయలేనిది. ఈ నోకార్డ్ విలేజి ఆయుర్వేద వైద్యునివల్ల ఏమౌతుందని కొట్టిపారేశాడు. కాని. భార్య పోరు పడలేక లోపల ఏమనుకున్నా "సరే ఆయన్ని పిలిపించండి" అన్నాడు. కొద్దిసేపట్లోనే ఆయన వచ్చాడు.

ఆయనకు నమస్కారం చెప్పి. ఉచితాసనం యిచ్చి మర్యాద చేశాడు. చేతులెత్తుకుని వున్న శ్రీలతను పిలిపించి ఆయన ముందు హాజరుపరిచాడు. హిస్టరీ అంతా వివరించి చెప్పాడు. ఓపిగ్గా అంతా విన్న తర్వాతే. ఆ ముసలి ఆయుర్వేద వైద్యుడు. తమచుట్టాలింటిదగ్గర మరచిపోయిన చేతికర్రను తెప్పించుకుని. అక్కడున్న వారందరినీ వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించాడు. తను పిలిచినప్పుడు. వెంటనే ఇద్దర్ని రమ్మని చెప్పాడు. శ్రీరామరెడ్డి. ఆయన

భార్యతో సహా అంతా ఇంట్లోనికి వెళ్ళిపోయారు. దొంగచాటుగా ఆ ఆయుర్వేద వైద్యుడు చేసే ట్రీట్‌మెంటును కిటికీల లోంచి అంతా పరికిస్తున్నారు.

శ్రీలతను ఆ వరండాలో ఈమూల నుంచి ఆమూల వరకు నడవమని ఆజ్ఞాపించాడు ఆ వృద్ధ ఆయుర్వేద వైద్యుడు. ఆమె నడిచి-వరండా ఈచివరవరకూ వచ్చింది. "వెనక్కి-తిరిగిరా" అని ఆజ్ఞాపించాడు. ఆమె తిరిగి నడిచి వస్తోంది. అతను పరుగుపరుగున వెళ్ళి తన చేతి కర్రతో ఆమె లంగాను పైకి ఎత్తాడు. అంతే! "అమ్మో" అంటూ పరికిణీని క్రిందికి దించే ప్రయత్నంలో, అప్రయత్నంగా రెండు చేతుల్నీ బలంగా క్రిందికి దించేసింది. వెంటనే ఆమె క్రిందికి దించిన చేతులు రెంటినీ బలంగా పట్టుకుని. "రండి! రండి!" అని కేకేశాడు ఆ వృద్ధ ఆయుర్వేద వైద్యుడు.

శ్రీరామరెడ్డి. ఆయనతో మరో పెద్ద మనిషి వెంటనే అక్కడకు పరుగెత్తుకుని వచ్చారు. "చేతులు కదలకుండా ఇలాగే గట్టిగా పట్టుకోండి" ఆజ్ఞాపించాడా వైద్యుడు వారు అలాగే చేశారు. తన పై మీద వున్న అంగవస్త్రంతో శ్రీలత చేతులను నడుము వెనుకకు పెట్టి గట్టిగా కట్టేశాడు. అది చూస్తున్న శ్రీ రామరెడ్డి. అతని భార్య తదితరులకు మనసులో ఆనందం కలిగినా, వాళ్ళ ముఖాలలో ఆశ్చర్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తూనే వుంది.

"ఆ మ్మాయికి విరోచనాలకు వేసి ఎన్నాళ్ళయింది?" ప్రశ్నించింది ఆ వృద్ధ ఆయుర్వేదవిజ్ఞానం.

"మూడు నాలుగు సంవత్సరాలయి వుంటుంది. పంతులుగారూ—" చెప్పింది శ్రీరామరెడ్డి భార్య.

"బాగా వాతం పేరుకుపోయిందమ్మా. రేపు విరేచనాలకు వెయ్యండి. ఆ.... ఓ గంట పోయింతర్వాత కందువా విప్పేసి, నాకు పంపించండి వుంటాను—" అని చెప్పి వెళ్ళిపోయాడా వృద్ధుడు—ఫీజుమాట ప్రస్తావించకుండానే.

ఎమ్.బి.బి. ఎస్‌లు, ఎమ్‌ఎస్‌లు నర్సింగ్ హోంలు, టాబ్లెట్లు — ఇంజక్షన్లు చెయ్యని వైద్యం. దేశీయ వైద్యం- వైద్య విధానం చెయ్యడం ఆశ్చర్యమే అనిపించింది అందరికీ!

